# ఘనంగా కొమరం భీమ్ విగ్రహావిష్కరణ

- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫారెస్ట్ డెవలప్‌మెంట్ చైర్మన్ పొదెం వీరయ్య
- ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలతో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు



**చర్ల, ఆగస్టు 09:(ప్రజాజ్యోతి):** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పుర స్కరించుకొని చర్ల మండల కేంద్రంలో ఆదివారం ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. చర్ల బస్టాండ్ ఎదురుగా ఏర్పాటు చేసిన కొమరం భీమ్ విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే, ఫారెస్ట్ డెవలప్‌మెంట్ చైర్మన్ పొదెం వీరయ్య

మిగతా 5 లో...

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | 10 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 8



# కొమరం భీమ్ ఆశయాల స్ఫూర్తితో ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడుకుందాం : మంత్రి సీతక్క

- భాష, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి
- ఆదివాసీ యువత విద్య, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి
- అశ్వారావుపేటలో కొమరం భీమ్ విగ్రహావిష్కరణ

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పుర స్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో కొమరం భీమ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచా యతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దానసరి అన సూయ (సీతక్క) హాజరయ్యారు. జిల్లాకు విచ్చేసిన మంత్రి సీతక్కకు ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు, కొమ్ము డాన్స్‌లతో ఆదివాసీ ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి సీతక్క, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ తదితరులు ఆదివాసీ ప్రజలతో కలిసి భారీ ర్యాలీగా అశ్వా రావుపేట ప్రధాన కూడలికి చేరుకు న్నారు. అశ్వారావుపేట ప్రధాన కూడ లిలో ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొమరం భీమ్ విగ్ర హాన్ని మంత్రి సీతక్క, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ కలిసి ఆవిష్కరించారు. అనంతరం కొమరం భీమ్ విగ్రహానికి పూలమా లలు వేసి ఘనంగా నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా

మిగతా 2 లో...

# గజ్జ కట్టి... బోనం ఎత్తి... చిందులేసి!



- దండు సారయ్య ఆధ్వర్యంలో ఆషాఢ మాస బోనాలు
- ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నుంచి ప్రధాన రోడ్ల మీదుగా సాగిన బోనాల జాతర
- చెరువు కట్ట వద్ద పెద్దమ్మ గుడిలో బోనాలు సమర్పణ
- ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని పెద్దమ్మ తల్లిని మొక్కిన దండు సారయ్య

**ఇల్లందు, ఆగస్ట్ 9 (ప్రజా జ్యోతి)** ఆషాఢ మాస బోనాల పండుగను పురస్క రించుకుని ఇల్లందులో భక్తిశ్రద్ధలతో బోనాల జాతర నిర్వహించారు. 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నుంచి బోనాల ఊరేగింపు వైభవంగా సాగింది. మహిళలు నెత్తిన బోనాలు ఎత్తుకోని, గజ్జలు కట్టి, సంప్రదాయ నృత్యాలతో సందడి చేయగా యువత, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నుంచి ప్రారం భమైన బోనాల ఊరేగింపు ప్రధాన రహదారుల మీదుగా కొనసాగింది. డప్పుల మోతలు, పోతరాజుల విన్యాసాలు, మహిళల బోనాల నృత్యాలతో పరిసర ప్రాంతాలు పండుగ వాతావరణాన్ని

మిగతా 2 లో...

# డ్రైనేజీలపై దుకాణాల దందా!

- నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్న పంచాయతీ అధికారులు..
- ప్రజలకు తప్పని అవస్థలు



**అశ్వాపురం: ఆగస్టు 9,ప్రజాజ్యోతి** ప్రజల సౌకర్యం కోసం నిర్మించిన డ్రైనే జీలు అక్రమ దుకాణాల ఏర్పాటుకు అడ్డాగా మారుతున్నాయి. మండలం లోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీలను ఆక్ర మించి కొందరు వ్యాపారులు విచ్చలవి డిగా దుకాణాలు ఏర్పాటు చేసుకుం టున్నా సంబంధిత పంచాయతీ అధికా రులు మాత్రం చూసీచూడనట్లు వ్యవ హరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తు న్నాయి. అప్పుడప్పుడు నోటీసులు జారీ చేస్తున్న అధికారులు, వాటి తర్వాత తీసుకోవాల్సిన చర్యలను మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ప్రధాన రహదా రుల వెంట ప్రజలు

మిగతా 5 లో...

# కొమరం భీం ఆశయ సాధన కోసం కృషి చేయాలి

- ఆదివాసీలు అన్ని రంగాల్లో రాణించాలి : ఎమ్మెల్యే కోరం



**ఇల్లందు, ఆగస్టు 9 (ప్రజా జ్యోతి)** జల్–జంగల్–జమీన్ హక్కుల కోసం పోరాడిన కొమరం భీం ఆశయ సాధన కోసం ఆదివాసీలు నిరంతరం కృషి చేయాలని, ఆదివాసీలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే కోరం కన కయ్య అన్నారు. ఆదివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించు కుని ఇల్లందు పట్టణంలో ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. స్థానిక గోవింద్ సెంటర్ నుంచి క్యాంపు కార్యా లయం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ముందుగా కొత్త బస్టాండ్ వద్ద గల కొమరం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం క్యాంపు కార్యాలయం వద్ద ఇల్లందు ఏరియా జీఎం వీసం కృష్ణయ్యతో కలిసి ఎమ్మెల్యే ఆదివాసీ జెండాను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీ సమాజానికి చిరస్మరణీయ నాయకుడని, ఆయన పోరాట స్ఫూర్తి ప్రతి ఆదివాసీ బిడ్డకు మార్గదర్శకమన్నారు. గత ప్రభుత్వాలు ఆదివాసీల

మిగతా 5 లో...

## గజ్జ కట్టి... బోనం ఎత్తి... చిందులేసి!



(మొదటి పేజీ తరువాయి...)

సంతరించుకున్నాయి. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ప్రధాన రహదారులు సందడిగా మారాయి.

**పెద్దమ్మ తల్లికి బోనాల సమర్పణ**

ఆషాడ మాస బోనాల ఊరేగింపు అనంతరం చెరువు కట్ట వద్ద ఉన్న పెద్దమ్మ గుడికి చేరుకోని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు భక్తి శ్రద్ధలతో బోనాలను సమర్పించి పెద్దమ్మ తల్లిని దర్శించుకున్నారు. అమ్మవారి ఆశీస్సులతో పట్టణ ప్రజలు సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య ప్రత్యేకంగా మొక్కుకున్నారు.

**సంప్రదాయాలను కాపాడుకోవాలి**

ఆషాఢ మాస బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య అన్నారు. తరతరాలుగా వస్తున్న ఆచారాలను కొనసాగిస్తూ భక్తిశ్రద్ధలతో బోనాల పండుగను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలంతా ఐకమత్యంతో పండుగను జరుపుకోవాలని, పెద్దమ్మ తల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. బోనాల జాతరలో మహిళలు, యువత, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. భక్తుల జయజయ ధ్వానాలతో పెద్దమ్మ ఆలయ పరిసరాలు మార్మోగాయి.

# జిల్లాలో ఘనంగా తీజ్ వేడుకలు





- **బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా వేడుకలు**
- **తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఆచారాలు**
- **కుటుంబ సమేతంగా పాల్గొన్న ప్రముఖ విలేఖరి మాలోత్ అశోక్**

**సుజాతనగర్, ఆగస్టు 9, ప్రజాజ్యోతి :** బంజారా గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాల్లో ప్రత్యేక స్థానం కలిగిన తీజ్ పండుగ వేడుకలు జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా సుజాతనగర్ మండలంలోని రూప్లా తండా గ్రామంలో ఆడపడుచులు, యువతులు తొమ్మిది రోజుల పాటు తీజ్ వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. తీజ్ పండుగలో భాగంగా గోధుమ విత్తనాలను ప్రత్యేకంగా సిద్ధం చేసిన బుట్టల్లో విత్తి తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పెంచడం ఆనవాయితీ. ప్రతిరోజూ తీజ్ బుట్టలకు పూజలు నిర్వహిస్తూ పాటలు పాడుతూ, సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. గోధుమ విత్తనాలు మొలకెత్తి పచ్చగా పెరగడం శుభసూచకంగా భావిస్తూ మంచి వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. తీజ్ పండుగ బంజారా ఆడపడుచుల ఐక్యత, కుటుంబ అనుబంధం, ప్రకృతితో వారి జీవన సంబంధాన్ని ప్రతిబింబించే సంప్రదాయ వేడుకగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా మహిళలు, యువతులు సంప్రదాయ దుస్తులు ధరించి పాటలు పాడుతూ నృత్యాలు చేయడంతో తండాలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రముఖ విలేఖరి మాలోత్ అశోక్ కుటుంబ సమేతంగా ప్రధాన అతిథిగా హాజరై తీజ్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజారా సమాజం తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ తీజ్ వంటి పండుగలను తరతరాలకు అందించడం అభినందనీయమన్నారు. ఆధునిక జీవన విధానంలో మార్పులు వస్తున్నప్పటికీ తమ మూలాలను మరవకుండా సంప్రదాయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. తొమ్మిది రోజుల పాటు పెంచిన తీజ్ మొలకలను సంప్రదాయ పద్ధతిలో పూజించి వేడుకలను ముగించారు. తీజ్ పండుగ ద్వారా గిరిజనుల జీవన విధానం, ప్రకృతితో ఉన్న అనుబంధం, వ్యవసాయంపై ఆధారపడిన సంప్రదాయాలు ప్రతిబింబిస్తాయని నిర్వాహకులు తెలిపారు. వేడుకల్లో మహిళలు, యువతులు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కొమరం భీమ్ ఆశయాల స్ఫూర్తితో ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడుకుందాం : మంత్రి సీతక్క

(మొదటి పేజీ తరువాయి...)

మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సమానత్వం కోసం కొమరం భీమ్ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అశ్వారావుపేటలో కొమరం భీమ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఆదివాసీ జేఏసీ నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. ఆదివాసీల పోరాట చరిత్ర ఎంతో గొప్పదని మంత్రి తెలిపారు . కాకతీయుల పాలనకు వ్యతిరేకంగా సమ్మక్క–సారలమ్మ చేసిన పోరాటం నుంచి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అల్లూరి సీతారామరాజు, నిజాం పాలనకు వ్యతిరేకంగా కొమరం భీమ్ చేసిన పోరాటాల వరకు ఆదివాసీలు తమ హక్కులు, ఆత్మగౌరవం, స్వేచ్ఛ కోసం నిరంతరం పోరాడారని తెలిపారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించడంతో పాటు వారికి న్యాయంగా దక్కాల్సిన హక్కుల కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని మంత్రి అన్నారు. ఏ కులానికీ, ఏ ప్రాంత ప్రజలకూ వ్యతిరేకంగా ఆదివాసీలు లేరని, తమకు న్యాయంగా రావాల్సిన హక్కుల కోసం మాత్రమే పోరాడుతున్నారని స్పష్టం చేశారు. అడవిపై హక్కులు, భూమిపై హక్కులు, విద్య, ఉపాధి, గృహాలు తదితర ప్రాథమిక అవసరాలు ఆదివాసీలకు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఆదివాసీ ప్రాంతాల నుంచి తమ సమస్యలను చెప్పుకునేందుకు వచ్చే ప్రజలను అధికారులు గౌరవంగా చూడాలని మంత్రి సూచించారు. పేదలు, చదువు లేని వారు తమ సమస్యలతో వచ్చినప్పుడు వారిని నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరి వినతిని ఓపికగా విని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు . ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో ఇప్పటివరకు వివిధ శాఖల ద్వారా సుమారు రూ.1,200 కోట్ల విలువైన అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్, గిరిజన సంక్షేమం, పంచాయతీరాజ్, రోడ్లు–భవనాల శాఖల ద్వారా నియోజకవర్గానికి అవసరమైన మరిన్ని అభివృద్ధి పనులను మంజూరు చేయించేందుకు తన వంతు సహకారం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కొమరం భీమ్ "జల్, జంగల్, జమీన్" నినాదంతో



పోరాటం చేశారని మంత్రి గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో నీళ్లు, నిధులు, నియామకాలు ప్రధాన అంశాలుగా నిలిచాయని తెలిపారు. కొమరం భీమ్ పోరాట స్ఫూర్తితో సాధించుకున్న తెలంగాణలో ఆదివాసీ బిడ్డలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ యువత విద్యారంగంలో మరింత ముందుకు వెళ్లాలని మంత్రి సీతక్క సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. యువత అభివృద్ధి చెందితేనే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఆదివాసీల భాష, సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలు, గోత్రాలు, జీవన విధానమే వారి అస్థిత్వమని మంత్రి సీతక్క అన్నారు. ఎంత ఉన్నత స్థానానికి ఎదిగినా తమ మూలాలను, మాతృభాషను, సంస్కృతిని, సంప్రదాయాలను మరచిపోకూడదని సూచించారు. మన భాష, మన వేషం, మన సంస్కృతి, మన సంప్రదాయాలే మన గుర్తింపు. వాటిని కాపాడుకుంటూ భావితరాలకు అందించాలి అని మంత్రి పిలుపునిచ్చారు. కొమరం భీమ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆదివాసీ సమాజ అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని మంత్రి సీతక్క తెలిపారు. ఆదివాసీ సమాజ విద్యాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదివాసీ సమాజంలో ఐక్యత, చైతన్యం, విద్యాభివృద్ధి పెంపొందించాలనే లక్ష్యంతో అనేక సంవత్సరాలుగా కృషి చేస్తున్నామని తెలిపారు. కొమరం భీమ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆదివాసీ సమాజానికి స్ఫూర్తినిచ్చే కార్యక్రమమన్నారు. ఆదివాసీ యువత విద్యారంగంలో మరింత ముందుకు వెళ్లాలని, ఉన్నత విద్యను అభ్యసించి అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో కొమరం భీమ్ పేరుతో ఏర్పాటు చేయనున్న అర్బన్ పార్కును మరింత అభివృద్ధి చేయడంతో పాటు అక్కడ గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయాలనే ఆకాంక్ష ఉందన్నారు. ఆదివాసీల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం భావితరాలకు తెలిసేలా మ్యూజియం, గిరిజన విద్యా వికాశం భవనం ఏర్పాటు చేయడానికి అవసరమైన సహకారం అందించాలని మంత్రి సీతక్కను కోరారు.

ఆదివాసీ సంక్షేమం, సంస్కృతి పరిరక్షణకు ప్రాధాన్యత : కలెక్టర్ అంకిత్ జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ఆదివాసీ సోదర, సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. కొమరం భీమ్ వంటి మహనీయుల పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు. కొమరం భీమ్, రాంజీ గోండు, సమ్మక్క–సారలమ్మ వంటి ఆదివాసీ వీరుల పోరాట చరిత్రను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీల భాష, సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వాన్ని పరిరక్షించడంతో పాటు విద్య, వైద్యం, మౌలిక వసతులు, ఉపాధి తదితర రంగాల్లో అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో చైతన్యం, ఐక్యతను పెంపొందించడంతో పాటు తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పిస్తాయని కలెక్టర్ అన్నారు . ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ విద్యా చందన, జెడ్పి సీఈవో నాగలక్ష్మి , మాజీ శాసనసభ్యులు మెచ్చ నాగేశ్వరరావు,ఆదివాసీ జేఏసీ నాయకులు, వివిధ గిరిజన సంఘాల ప్రతినిధులు, కొండరెడ్డి, నాయకపోడు తదితర గిరిజన వర్గాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆదివాసీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంకమ్మ తల్లి ఆలయంలో వైభవంగా ఆషాఢ బోనాలు

- **మేళతాళాలతో అమ్మవారికి బోనాలు సమర్పించిన భక్తులు**





**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 9, (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి గ్రామంలో కొలువుతీరి ఉన్న అంకమ్మ తల్లి ఆలయంలో ఆషాఢ మాసం చివరి ఆదివారం బోనాల కార్యక్రమాన్ని అంగ రంగ వైభవంగా నిర్వహించారు. హరి హర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మారగాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ పర్యవేక్షణలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. బోనాల ఊరేగింపులో శివశక్తుల నృత్యాలు, డప్పు చప్పుళ్లు, మేళతాళాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి భక్తులు అమ్మవారికి బోనాలు తీసుకువచ్చి మేళతాళాల మధ్య భక్తిశ్రద్ధలతో సమర్పించారు. మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలు ఎత్తుకుని ఆలయానికి చేరుకోవడంతో గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.అంకమ్మ తల్లి ఆశీస్సులతో పాటు శ్రీ గోపయ్య, తిరుపతమ్మ అమ్మవార్లను, మహాలక్ష్మి అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా బోనం సమర్పణ కోసం విగ్రహాన్ని తయారు చేసి ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామం మొత్తం భక్తిశ్రద్ధలతో అత్యధిక సంఖ్యలో పాల్గొని బోనాల కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.అన్నపురెడ్డిపల్లి సర్పంచ్ లాకవత్ లక్ష్మి, ఉపసర్పంచ్ మారగాని అశోక్ ఆధ్వర్యంలో ఎమ్మెస్సార్ యూత్ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేపట్టారు. తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పిస్తూ భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వరరావు బోనాల కార్యక్రమంలో పాల్గొని అంకమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిర్వాహకులు భక్తుల కోసం పెద్ద ఎత్తున మహా అన్నదానం ఏర్పాటు చేయగా, భక్తులు పెద్ద సం ఖ్యలో పాల్గొని భోజనాలు స్వీకరించారు. గ్రామ ప్రజల ఐక్యత, భక్తిశ్రద్ధ లు, నిర్వాహకుల సమన్వయంతో ఆ షాఢ మాసం చివరి ఆదివారం నిర్వహించిన అంకమ్మ తల్లి బోనాల వేడుకలు విజయవంతంగా ముగిశాయి. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని భక్తులు ఆకాంక్షించారు.

## ఘనంగా ఆషాఢమాస బోనాలు

- **రజక సంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో వేడుకలు**





**కొత్తగూడెం, ఆగస్టు 9, ప్రజా జ్యోతి:** ఆషాఢమాసం సందర్భంగా రజక సంఘం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీనగర్ కాలనీ నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలు ఎత్తుకుని డప్పు వాయిద్యాల నడుమ శేషగిరినగర్‌లోని మడేలయ్య దేవాలయానికి చేరుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలను అమ్మవారికి సమర్పించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్తూ ఆటపాటలతో నృత్యాలు చేస్తూ సందడి చేశారు. భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.పట్టణంలోని ఏ పవర్‌హౌస్ బస్తీలో రజక సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి, రజక సంఘం గౌరవ అధ్యక్షుడు నేరెళ్ల రమేష్, కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడు సుంకరి అజిత్, కార్యదర్శి దురిశెట్టి కుమార్, పట్టణ ఉపాధ్యక్షులు బుసరాజు, జంగంపల్లి రాజు, సంఘం నాయకులు కొలిపాక సత్యం, రాచర్ల సర్వేశ్వరరావు, ఎర్ర కనకారావు, మంచినీళ్ల శ్రీనివాస్, భూపెల్లి అంజయ్య, చింతమడక పోశం, శంకర్, కొత్తపల్లి కుమార్ పాల్గొన్నారు.

## జల్.. జంగల్.. జమీన్ హక్కులను కాపాడుకుందాం

- **పోడు భూములకు పట్టాలిచ్చి ఆదుకోవాలి.. అటవీ చట్టాల సవరణ కుట్రలను తిప్పికొడతాం**
- **కొమరం భీమ్ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలి: సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా**

**లక్ష్మీదేవిపల్లి/కొత్తగూడెం, ఆగస్టు 9, ప్రజా జ్యోతి:** అడవి, భూమి, ఆత్మగౌరవం కోసం గిరిజనులు సాగించిన వీరోచిత పోరాటాలను కొనసాగిస్తూ వారి హక్కుల పరిరక్షణకు ఏకమవ్వాల్సిన అవసరం ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇల్లందు క్రాస్‌రోడ్‌లో ఉన్న విప్లవ వీరుడు కొమరం భీమ్ విగ్రహానికి సీపీఐ నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ తరతరాలుగా అడవినే నమ్ముకుని జీవిస్తున్న గిరిజనుల హక్కులను కాలరాసే విధంగా పాలకుల విధానాలు ఉన్నాయని విమర్శించారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు వెంటనే పట్టాలు మంజూరు చేసి గిరిజన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అటవీ హక్కుల చట్టాన్ని సవరించి కార్పొరేట్ శక్తులకు అటవీ సంపదను కట్టబెట్టేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ప్రజలంతా ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. జల్.. జంగల్.. జమీన్ కోసం ప్రాణాలర్పించిన కొమరం భీమ్ వీరోచిత పోరాట స్ఫూర్తితో గిరిజనుల ఆత్మగౌరవ రక్షణకు, హక్కుల సాధనకు భవిష్యత్తులో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.




## ఆదివాసి చట్టాలు అమలయేల పాలకులు పనిచేయడం లేదు

- **అఖిలపక్ష నేతలు**
- **ఘనంగా ఆదివాసి దినోత్సవ కార్యక్రమం**




**గుండాల ఆగస్టు 9 ప్రజా జ్యోతి** పూర్తిస్థాయిలో ఆదివాసి చట్టాలు అమలయ్యేలా ప్రభుత్వాలు, అధికారులు పనిచేయడం లేదని అఖిలపక్ష నేతలు అన్నారు ఆదివారం మండల కేంద్రంలో అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన కోడలలో ర్యాలీ నిర్వహించిన అనంతరం గ్రామపంచాయతీ ముందు కొమరం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి, జెండా ఆవిష్కరించారు. అనంతరం తుడుం దెబ్బ నాయకులు వచ్చా ఎర్రయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అఖిలపక్ష నేతలు గుండాల గుండాల సర్పంచ్ కోరం సీతారాములు, మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి ఈసం శ్రీను (శంకర్) లింగగూడెం సర్పంచ్ చింతా వెంకటేశ్వర్లు, ముత్తాపురం సర్పంచ్ కల్తీ రాధా, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు వాగబోయిన చంద్రయ్య దొర, మండల అధ్యక్షులు పూనెం రమణబాబు, తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు అధ్యక్షులు పూణెం శ్రీను, మాట్లాడుతూ ఆదివాసి చట్టాలను అమలయేల ప్రభుత్వాలు పనిచేయాలని కోరారు. ఏజెన్సీలోని ఆదివాసులు నేటికీ ప్రభుత్వ పొలాలకు దూరంగా ఉన్నారని అన్నారు. ఆదివాసి చట్టాల అమలుకై అన్ని పార్టీలు ఐక్య ఉద్యమాల ద్వారా పోరాడాలని పిలుపునిచ్చారు.తుడుం దెబ్బ నాయకులు గోవింద నరసింహారావు, పెండేకట్ల మహేందర్, నాగరాజు, మోకా ళ్ళ మహేందర్, సిపిఎం నాయకులు ఊకె వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు మోకా ళ్ళ కుమార్, టిఆర్ఎస్ నాయకులు మోకాళ్ళ వీరస్వామి, బిజెపి నాయకులు సోలం సతీష్, ఉద్యోగుల సంఘం నాయకులు పెండేకట్ల సత్యం, చౌక పోతయ్య పాల్గొన్నారు.

## కన్నులపండువగా బోనాల జాతర

- **భక్తిశ్రద్ధలతో పోచమ్మ అమ్మవారికి బోనాల సమర్పణ**

**కొత్తగూడెం, ఆగస్టు 9, ప్రజాజ్యోతి :** ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని కొత్తగూడెం పరిధిలోని మెదర్‌బస్తీలో బోనాల జాతర మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. శేషు స్వామి, బట్టు దుర్గల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా కొనసాగాయి. మెదర్‌బస్తీ నుంచి ప్రారంభమైన బోనాల శోభాయాత్ర పెద్దబజారు, సూపర్‌బజారు మీదుగా రైతుబజార్‌లోని శ్రీ పోచమ్మ దేవాలయం వరకు సాగింది. డప్పు వాయిద్యాల హోరుతో శోభాయాత్ర ఉత్సాహంగా కొనసాగింది. మహిళలు బోనాలతో నృత్యాలు చేస్తూ సందడి చేశారు. పోతురాజుల విన్యాసాలు, శివశక్తుల పూనకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దీంతో బోనాల ఊరేగింపు కోలాహలంగా సాగింది. మహిళలు తలపై బోనాలు మోసుకుంటూ పోచమ్మ దేవాలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాల నిర్వాహకులు శేషు స్వామి, దుర్గ మాట్లాడు తూ.. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. భక్తిశ్రద్ధలతో ఏటా బోనాల జాతరను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. జాతర సందర్భంగా అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు, స్థానికుల కోసం నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్తీ ప్రజలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ బానోత్ కళావతి, వట్టం విజయ, కంగళ రామలక్ష్మి తదితరులు హాజరయ్యారు. జాతర విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రజలు, యువకులు, భక్తులు, సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.



## ఢీకొన్న ద్విచక్ర వాహనాలు

- **ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు**
- **చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు**

**చర్ల, ఆగస్టు 09: (ప్రజాజ్యోతి):** చర్ల మండలం సత్యనారాయణపురం మూలమలుపు వద్ద ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దిపల్లి గ్రామానికి చెందిన కనితి వంశీ, ఇర్పా లోకేష్‌తో పాటు సూరవేడు గ్రామానికి చెందిన యాక సర్వేష్ ద్విచక్ర వాహనాలపై వెళ్తుండగా సత్యనారాయణపురం మూలమలుపు వద్ద రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ సాయి వర్ధన్ ప్రథమ చికిత్స అందించి తీవ్రంగా గాయపడిన కనితి వంశీ, ఇర్పా లోకేష్‌లను మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలిస్తున్నట్లు వైద్యులు తెలిపారు.





## జైల్‌భరోను జయప్రదం చేయాలి

- ఆగస్టు 10న జిల్లా కేంద్రంలో చలో.. జైల్‌భరో



**కొత్తగూడెం, ఆగస్టు 9, ప్రజా జ్యోతి :** రైతులకు కనీస మద్దతు ధరను చట్టబద్ధంగా అమలు చేయాలని, రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆగస్టు 10న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న చలో.. జైల్‌భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం-ఖమ్మం సంయుక్త జిల్లా కమిటీ కార్యదర్శి కందగట్ల సురేందర్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇఫ్టు కార్యాలయంలో జోగ రామన్న అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన సీ2+50 శాతం విధానంలో కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత విధానం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చే విధానాలను కేంద్ర ప్రభుత్వం విడనాడాలని అన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులను నియంత్రించి దేశీయ రైతులను ఆదుకోవాలని, రైతు వ్యతిరేక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను తిరస్కరించాలని కోరారు. రైతులు, వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని జైల్‌భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని తెలిపారు. సమావేశంలో జిల్లా కమిటీ నాయకులు సింగనబోయిన రాము, అమరాజు గట్టయ్య, వీరమళ్ల రాములు, బెజవాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసుల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి

- కొమరం భీమ్ సెంటర్‌లో వెంకటేష్ దొర ఆధ్వర్యంలో వేడుకలు
- పెంట్లం గ్రామంలో కూడా సర్పంచ్ కారం శివ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ

**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 9, (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోగల కొమరం భీమ్ ప్రధాన సెంటర్‌లో ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలను తుడుందెబ్బ మండల అధ్యక్షుడు కుంజా వెంకటేష్ దొర ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుంజా వెంకటేష్ దొర ప్రపంచ ఆదివాసి జెండాను ఆవిష్కరించి, కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కొమరం భీమ్, బిర్సా ముండా వంటి పోరాట యోధుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కుంజా వెంకటేష్ దొర మాట్లాడుతూ ఆదివాసుల హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడిన మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. వారి అడుగుజాడల్లో నడుస్తూ ఆదివాసుల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసి నాయకులు మడివి నాగేంద్రబాబు, తాటి చంద్రరావు, సున్నం వెంకటేష్, తాటి వెంకటేశ్వర్లు, సున్నం సుధాకర్, గుండు రత్నం బాబు, చింత నరసింహారావు, తాటి భద్రం, తాటి మురళి, సోయం రవిప్రసాద్, కుంజా తిరుపతిరావు, వాడే రవి, కుర్సం శివ, ఆదివాసి యువత తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పెంట్లం గ్రామంలో కూడా ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలను సర్పంచ్ కారం శివ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కారం శివ ప్రపంచ ఆదివాసి జెండాను ఆవిష్కరించి, ఆదివాసి దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కొమరం భీమ్, బిర్సా ముండా వంటి పోరాట యోధుల ఆశయాలను కొనసాగిస్తూ ఆదివాసుల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ ఆదివాసులు, యువత పాల్గొన్నారు.



## వనభోజనాలతో ఆధ్యాత్మిక సందడిగా మారిన శివాలయ ప్రాంగణం

- మల్లికార్జున స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన కొత్తగూడెం మార్వాడి అసోసియేషన్





**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 9, (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి దేవస్థానంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని కొత్తగూడెం మార్వాడి అసోసియేషన్ సభ్యులు వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వనభోజనాలు నిర్వహించారు. ఆదివారం కావడంతో ఆలయ ప్రాంగణం భక్తులు, కుటుంబ సభ్యులు, చిన్నారులతో సందడిగా మారింది. ఆటపాటలతో చిన్నారులు, కుటుంబ సభ్యులు ఆహ్లాదంగా గడిపారు. అన్నపురెడ్డిపల్లిలో కొలువుతీరిన శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి దేవస్థానం ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. ప్రశాంతమైన వాతావరణం, పచ్చని చెట్లు, విశాలమైన ఆలయ ప్రాంగణం భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. భక్తులు, కుటుంబ సభ్యులు వనభోజనాలు నిర్వహించుకునేందుకు ఆలయంలో ప్రత్యేకంగా సత్రం అందుబాటులో ఉంది. భోజనాల కోసం పెద్దగా నిర్మించిన నాలుగు ప్రత్యేక షెడ్లు ఉండటంతో పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు ఎంతో అనుకూలంగా ఉంది. ఆలయ ప్రాంగణంలో కోనేరు కూడా ఉండటంతో దేవస్థానం మరింత ఆహ్లాదకరంగా కనిపిస్తోంది. ప్రతి సంవత్సరం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, కుటుంబ సభ్యులు, విద్యార్థులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని వనభోజనాలు నిర్వహిస్తున్నారు. పాఠశాల విద్యార్థులు సైతం ఆలయాన్ని సందర్శించి ఆధ్యాత్మిక వాతావరణంలో ఆటపాటలతో ఆనందంగా గడుపుతున్నారు. దీంతో అన్నపురెడ్డిపల్లి శివాలయం భక్తి, ఆధ్యాత్మికతతో పాటు కుటుంబ సమేతంగా ఆహ్లాదంగా గడిపే చక్కటి ప్రదేశంగా గుర్తింపు పొందుతోంది. వనభోజనాలకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తాగునీరు, భోజనాల ఏర్పాట్లకు అవసరమైన సౌకర్యాలతో పాటు ఆలయ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. ఆలయ సిబ్బంది సహకారం పట్ల భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ పి.వి. రమణ తదితరులు పాల్గొన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓం నమఃశివాయ నామ స్మరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అన్నపురెడ్డిపల్లి శివాలయం ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా వనభోజనాలు, కుటుంబ సమేతంగా ఆహ్లాదంగా గడిపేందుకు అనువైన ప్రదేశంగా భక్తులను ఆకర్షిస్తోంది.

## హక్కుల పరిరక్షణకు గిరిజనుల ఐక్య పోరాటం

- గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి
- అడవులు, భూములు, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి



**లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 9, ప్రజా జ్యోతి :** ప్రపంచ గిరిజన ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని లక్ష్మీదేవిపల్లి మండలం గడ్డిగుట్ట గ్రామపంచాయతీలో సేవాలాల్ బంజారా సంఘాల ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి గిరిజనుల హక్కులు, చట్టాల అమలు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లావుడియా ప్రసాద్ నాయక్ మాట్లాడుతూ గిరిజనుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజనుల కోసం రూపొందించిన చట్టాలను పకడ్బందీగా అమలు చేయడంతో పాటు అడవులు, ప్రకృతి వనరులను కాపాడాలని అన్నారు. తరతరాలుగా గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు రక్షణ కల్పించాలని, అటవీ హక్కులను పరిరక్షించాలని, గిరిజనులపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. అంతరించిపోతున్న గిరిజన ఆదివాసీ మాతృభాషలను పరిరక్షించడంతో పాటు వారి జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, సంప్రదాయ వైద్యం, విద్య, ఉపాధి అవకాశాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, పీసా చట్టాన్ని అమలు చేయడంతో పాటు అటవీ హక్కుల చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని కోరారు. గిరిజనుల హక్కుల పరిరక్షణకు కీలకమైన జీవో నంబర్ 3ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. గిరిజన ఆదివాసీ సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గడ్డిగుట్ట సర్పంచ్ బోడా సంతోష్ నాయక్, సేవాలాల్ బంజారా సంఘం విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి బోడా శ్రీనివాస్ నాయక్, లావుడియా నరేష్ నాయక్, బోడా నరేష్ నాయక్, బోడా గణేష్ నాయక్, లావుడియా సాయి కుమార్ నాయక్, సింహాద్రి నాయక్, ప్రవీణ్ నాయక్, చిట్టిబాబు నాయక్, అరుణ్ నాయక్, కుమార్ నాయక్‌తో పాటు మహిళలు పాల్గొన్నారు.

## కొమురం భీమ్ ఆశయాలను కొనసాగించాలి

- కేశవాపురంలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు

**చర్ల, ఆగస్టు 09: (ప్రజాజ్యోతి):** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేశవాపురం గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన కొమురం భీమ్ విగ్రహం వద్ద ఆదివారం ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కాపుల శారద ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తొలుత కొమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆదివాసీ జెండాను ఆవిష్కరించి వేడుకలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ కాపుల శారద మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం కోసం జీవితాంతం పోరాడిన యోధుడు కొమురం భీమ్ అని అన్నారు. 'జల్, జంగల్, జమీన్' నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం ఆయన సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని అన్నారు. ఆదివాసీ సమాజం కోసం కొమురం భీమ్ చేసిన త్యాగాలు, పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు. ఆదివాసీ యువత కొమురం భీమ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సామాజిక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సర్పంచ్ సూచించారు. తమ హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకొని సమాజ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదే సమయంలో ఆదివాసీల ప్రత్యేకతకు ప్రతీకగా నిలిచే సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆదివాసీ సమాజ అభ్యున్నతికి విద్య, ఉపాధి, సామాజిక చైతన్యం ఎంతో అవసరమని పేర్కొంటూ యువత ఈ రంగాల్లో ముందంజలో ఉండాలని ఆమె ఆకాంక్షించారు. కొమురం భీమ్ ఆశయాలను కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా ఆయన చూపిన మార్గంలో హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కూనారపు సతీష్, కాపుల నాగరాజు, కోరం నాగేంద్ర, తాటి పాపారావు, హిమగిరి వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, చిట్టిబాబు, సూరిబాబు, రామారావు, కృష్ణ, సుబ్బారావు, శ్రీను, రాధాతో పాటు గ్రామ ప్రజలు, ఆదివాసీ నాయకులు, యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా కొమరం భీమ్ విగ్రహావిష్కరణ





(మొదటి పేజీ తరువాయి...)

ఆదివాసీ నాయకులు, ప్రజలు, యువత, మహిళల సమక్షంలో ఘనంగా ఆవిష్కరించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఆదివాసీ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో మండల కేంద్రంలో సందడి నెలకొంది. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కొమ్ముడోలు నృత్యాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.తొలుత చర్ల అంబేద్కర్ సెంటర్‌లోని ఆదివాసీ జెండా గద్దె వద్ద ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమాలను ప్రారంభించారు. చర్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం కొబ్బరికాయ కొట్టి కార్యక్రమానికి శ్రీకారం చుట్టగా అనంతరం ఉపసర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, చర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరపా శ్రీనివాసరావుతో పాటు ఆదివాసీ నాయకులు జెండా గద్దె వద్ద కొబ్బరికాయలు కొట్టి ఆదివాసీ ఉద్యమ నాయకులకు నివాళులర్పించారు. చర్ల సీఐ రాజువర్మ, ఎస్సై నర్సిరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొనాగా సీఐ రాజువర్మ ఆదివాసీ ఉద్యమ నాయకులకు అంజలి ఘటించి ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆదివాసీ యువత, మహిళలు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయ దుస్తుల్లో కొమ్ముడోలు నృత్యాలు చేస్తూ తమ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పారు. అంబేద్కర్ సెంటర్ నుంచి బస్టాండ్ ప్రాంతం వరకు నృత్యాలు, సంప్రదాయ కార్యక్రమాలతో సందడి నెలకొంది. అనంతరం మాజీ ఎమ్మెల్యే, ఫారెస్ట్ డెవలప్‌మెంట్ చైర్మన్ పొదెం వీరయ్య బస్టాండ్ ఎదురుగా ఏర్పాటు చేసిన కొమరం భీమ్ విగ్రహం వద్దకు చేరుకోగా ఆయనకు ఆదివాసీ నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారి సమక్షంలో విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొమరం భీమ్ పోరాట స్ఫూర్తిని గుర్తు చేసుకుంటూ ఆదివాసీ నాయకులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పొదెం వీరయ్య మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడు కొమరం భీమ్ అని ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, భూమి, అటవీ వనరుల పరిరక్షణ కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని అన్నారు . కొమరం భీమ్ త్యాగాలను ప్రతి ఆదివాసీ గుర్తుంచుకోవాలని, ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆదివాసీలు తమ హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు. యువత విద్య, ఉద్యోగాలు, ఉపాధి రంగాల్లో ముందుకు రావడంతో పాటు తమ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని అన్నారు. ఆదివాసీ సమాజం ఐక్యంగా ఉంటేనే సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని అన్నారు . ఆచారాలు, సంప్రదాయాలను కొనసాగిస్తూ భవిష్యత్ తరాలకు అందించాలని పిలుపునిచ్చారు. ఆధునిక విద్య, సాంకేతిక రంగాల్లో యువత ముందుకు సాగాలని సూచించారు.చర్ల మండల కేంద్రంలో కొమరం భీమ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆదివాసీ సమాజానికి గర్వకారణమని నాయకులు అన్నారు. ఈ విగ్రహం ద్వారా కొమరం భీమ్ పోరాట చరిత్ర, త్యాగాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే కొమరం భీమ్‌కు నిజమైన నివాళి అని అన్నారు.ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరపా శ్రీనివాసరావు, సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, ఉపసర్పంచ్ కాపుల కృష్ణా అర్జునరావు, సీఐ రాజు వర్మ, ఎస్సై నర్సిరెడ్డి, ఆదివాసీ జేఏసీ నాయకులు ఇరప రాజు, వరప్రసాద్, జేఏసీ చైర్మన్ వాసం ముసలయ్య, హిమగిరి, రామారావు, ఇరప వసంత్ , ఆదివాసీ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీలపై దుకాణాల దందా!

(మొదటి పేజీ తరువాయి...)

వాహనదారులు సులభంగా రాకపోకలు సాగించేందుకు, వర్షపు నీరు, మురుగునీరు సాఫీగా వెళ్లేందుకు ఏర్పాటు చేసిన డ్రైనేజీలను కొందరు తమ వ్యాపార అవసరాలకు వినియోగించుకుంటున్నారు. డ్రైనేజీలపై షెడ్లు, దుకాణాలు ఏర్పాటు చేయడంతో కాలువలు పూర్తిగా కప్పబడిపోతున్నాయి. దీంతో మురుగునీరు సక్రమంగా ప్రవహించకపోవడంతో చిన్నపాటి వర్షానికే రహదారులపై నీరు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతోంది.



**నోటీసులతోనే సరిపెడుతున్నారా?**

డ్రైనేజీలపై అక్రమంగా దుకాణాలు ఏర్పాటు చేసిన వారికి పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే నోటీసులు ఇచ్చిన తర్వాత వాటిని అమలు చేయించే విషయంలో అధికారులు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారనే ప్రశ్నలు ప్రజల్లో తలెత్తుతున్నాయి. నోటీసులు జారీ చేసినా కొందరు యథావిధిగా దుకాణాలను కొనసాగిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు ప్రకటిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉందని ప్రజలు అంటున్నారు. నోటీసులు జారీ చేయడం, హెచ్చరించడం వంటి చర్యలకే అధికారులు పరిమితమైతే ఆక్రమణలు ఎలా తొలగుతాయని ప్రశ్నిస్తున్నారు.

**వర్షాకాలంలో మరింత ఇబ్బందులు**

ప్రస్తుతం వర్షాకాలం కావడంతో డ్రైనేజీలపై ఉన్న ఆక్రమణల ప్రభావం మరింత స్పష్టంగా కనిపిస్తోంది. కాలువల్లో నీరు సక్రమంగా వెళ్లే మార్గం లేకపోవడంతో వర్షపు నీరు రోడ్లపైకి చేరుతోంది. దీంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల మురుగునీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు, ఈగలు పెరిగే అవకాశం ఉండటంతో పాటు పారిశుద్ధ్య సమస్యలు కూడా తలెత్తుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీలను శుభ్రం చేయాల్సిన సిబ్బందికి కూడా ఆక్రమణల కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు.

**అధికారులు ఉన్నట్టా.. లేనట్టా?**

ప్రజలకు నిత్యం కనిపించే సమస్యపై పంచాయతీ అధికారులు ఎందుకు పూర్తిస్థాయిలో స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. డ్రైనేజీలపై అక్రమ నిర్మాణాలు జరుగుతున్న సమయంలోనే వాటిని అడ్డుకోవాల్సిన అధికారులు, నిర్మాణాలు పూర్తయిన తర్వాత నోటీసులు ఇచ్చి మౌనం వహించడం వల్లే ఆక్రమణలు మరింత పెరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే స్పందించి, ఆ తర్వాత మళ్లీ సమస్యను పక్కన పెట్టడం వల్ల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని అంటున్నారు. నిబంధనలు అందరికీ సమానంగా వర్తించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**ఆక్రమణలు తొలగించి డ్రైనేజీలను అందుబాటులోకి తేవాలి**

డ్రైనేజీలపై ఉన్న అన్ని అక్రమ దుకాణాలను గుర్తించి, సమగ్ర సర్వే నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలకు ముందుగా నోటీసులు ఇచ్చి, గడువు ముగిసిన వెంటనే వాటిని తొలగించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కేవలం నోటీసులు జారీ చేసి అధికారులు చేతులు దులుపుకోకుండా, డ్రైనేజీలను ఆక్రమణల నుంచి విముక్తి చేసి మురుగునీరు సక్రమంగా వెళ్లేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. వర్షాకాలంలో సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉన్నందున పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని, లేకుంటే ప్రజలు ఆందోళనకు దిగాల్సి వస్తుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

## కొమరం భీం ఆశయ సాధన కోసం కృషి చేయాలి






(మొదటి పేజీ తరువాయి...)

అభివృద్ధిని పట్టించుకోలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఆదివాసీ సమాజం విద్య, ఉపాధి, ఆర్థిక రంగాల్లో ముందుకు సాగేందుకు మరింత కృషి అవసరమని తెలిపారు. ఈకార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బోళ్ళ సూర్యం, మండల రాము, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ఆదివాసి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యను పరిష్కరించాలని వినతి





**ములకలపల్లి ఆగస్టు 09 (ప్రజాజ్యోతి):** మండలంలో గిరిజనులు, ఫారెస్ట్, కార్పొరేషన్ అధికారుల మధ్య నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు అనంతుల సత్యనారాయణ, వట్టం శ్రీను తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్యకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. మూకమామిడి పంచాయతీ పరిధిలోని సాయిరాంపురం గ్రామంలో గిరిజన ఆదివాసీలు సుమారు 25 ఏళ్లుగా ఇళ్ల స్థలాల కోసం వినియోగిస్తున్న స్థలంలో శివాలయాన్ని నిర్మించుకుని పూజలు నిర్వహిస్తున్నారని, కార్పొరేషన్ అధికారులు అక్కడ ట్రెంచ్ తవ్వేందుకు ప్రయత్నిస్తున్నారని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ములకలపల్లి మండలంలో పర్యటించి గిరిజనుల భూ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు

## 50 లీటర్ల నాటుసారాయి పట్టివేత

- తాలిపేరు ప్రాజెక్ట్ వద్ద ద్విచక్రవాహనంలో తరలిస్తుండగా స్వాధీనం



**చర్ల, ఆగష్టు 09(ప్రజా జ్యోతి ):** చర్ల మండంలోని తాలిపేరు ప్రాజెక్టు వద్ద ద్విచక్రవాహనంలో అక్రమంగా తరలిస్తున్న 50 లీటర్ల నాటుసారాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరిని అదుపులోకి తీసుకుని, నాటుసారాయితో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి.సోమిరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్ ఆదేశాల మేరకు ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సీహెచ్.శ్రీనివాస్, ఎస్ఐ సీహెచ్.శ్రీహరిరావు సిబ్బందితో కలిసి తాలిపేరు ప్రాజెక్టు పంప్‌హౌస్ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వస్తున్న టీజీ 28 జే 0292 నంబరు గల ద్విచక్రవాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, ప్లాస్టిక్ డ్రమ్ములో 50 లీటర్ల నాటుసారాయి ఉన్నట్లు గుర్తించారు. నాటుసారాయిని తోగ్గూడెం నుంచి చర్లకు తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ ఘటనకు సంబంధించి పర్సిక సుధాకర్ (తండ్రి సీతయ్య), పోడియం సాంబశివరావు (తండ్రి లక్ష్మయ్య)లను అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న 50 లీటర్ల నాటుసారాయి, ద్విచక్రవాహనంతో పాటు ఇద్దరు నిందితులను తదుపరి విచారణ నిమిత్తం భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహ్మద్, కానిస్టేబుళ్లు రాజు, వీరబాబు, ప్రసన్నకుమార్, ఉపేందర్ పాల్గొన్నారు.

## గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి



**చర్ల, ఆగష్టు 09(ప్రజాజ్యోతి ):** గిరిజనుల హక్కుల పరిరక్షణకు సంబంధించిన చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి వరదల వరలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం చర్ల మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని విజయకాలనీలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.కొమరం భీమ్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వరదల వరలక్ష్మి ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం బందెల చంటి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ గిరిజన చట్టాల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆదివాసీల హక్కులను పరిరక్షించేందుకు ఉద్దేశించిన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.సహజ వనరుల దోపిడీకి అనుకూలంగా ఉండేలా కేంద్ర ప్రభుత్వం నూతన అటవీ చట్టాలను తీసుకువస్తోందని వరలక్ష్మి విమర్శించారు. అడవులు, భూమి, నీటి వనరులపై ఆదివాసీలకు హక్కులు ఉండాలని ఆదివాసీల జీవనాధారమైన సహజ వనరులను కాపాడేందుకు ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.కొమరం భీమ్ స్ఫూర్తితో ఆదివాసీలు తమ హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఆదివాసీ ప్రజలు తమ హక్కులు, ఆత్మగౌరవం, జీవనాధారాల పరిరక్షణ కోసం పోరాటాలు సాగిస్తున్నారని ఆదివాసీ హక్కులను కాపాడేందుకు ప్రజలు ఐక్యంగా ముందుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు మచ్చ రామారావు, బి.నవీన్, ఐద్వా మండల కార్యదర్శి పొడుపుగంటి సమ్మక్క, వ్యవసాయ కార్మిక సంఘం మండల మహిళా కన్వీనర్ ఉడుగుల షారోను, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడే బిజెపి ప్రభుత్వం గద్దె దిగాలి

- షాబీర్ భాష
- ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో పాలకులు విఫలం
- హామీలు నిలబెట్టుకొని ప్రభుత్వాలు మనకెందుకు
- ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటుకరణ ను సమిష్టిగా అడ్డుకుందాం







**గుండాల ఆగస్టు 9 ప్రజాజ్యోతి** ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి షాబీర్ భాష అన్నారు ఆదివారం గుండాల మండల కేంద్రంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా చైతన్య యాత్ర ఉద్దేశించి మాట్లాడారు. సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర లో భాగంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు అనంతరం గుండాల మండల కేంద్రంలోని సెంటర్లో సిపిఐ పార్టీ నాయకులు వాగబోయిన రమేష్ జాహీద్ అధ్యక్షతన జరిగిన సభను ద్వేషించి ఆయన మాట్లాడారు నేడు రైతులు వ్యవసాయం చేసుకోవడానికి అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఈ ప్రభుత్వాల చేతగాని తనానికి రైతులు మోసపోతున్నారని డబ్బులు పట్టుకొని ఎరువులు కొనుక్కోలేని స్థితిలో రైతాంగం ఉందని, ఎరువులు యాప్ల ద్వారా కొనుక్కోవడం ఏంటని విమర్శించారు. రైతు, యువజన, మహిళా, విద్యార్థి, కార్మిక ప్రజానీకాన్ని మోసం చేసే ఈ ప్రభుత్వం ఎందుకని ప్రశ్నించారు. అన్ని రంగాల్లో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వాలు పనిచేయడం లేదని పేర్కొన్నారు. మోడీ సర్కార్ ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలను ఖూనీ చేస్తుందని ధ్వజమెత్తారు. ప్రశ్నించే గొంతులను నొక్కిస్తూ, కక్ష పూరితంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్ సంస్థలకు తెగనమ్ముతూ, దేశ సంపదను బడాబాబులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, కనీస మౌలిక వసతుల కల్పన, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణే ద్వేయంగా "బద్లవ్ జరూర్ హై"నినాదంతో ప్రజా చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నామని అన్నారు సెప్టెంబర్ 1న ఢిల్లీలో జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏజెన్సీలో పోడు భూములకు పట్టాలిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వ మాటలు నీటి మూటలుగానే మిగిలాయ్ అన్నారు. మూడు సంవత్సరాలు కావస్తున్న హామీలు నిలబెట్టుకోలేదని హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం నోరు మెదపట్లేదన్నారు. ఇందిరమ్మ ఇల్లు కావాలంటే తమ పార్టీలో చేరాలని అనడం సిగ్గుచేటు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నారాటి ప్రసాద్, సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సోమిరెడ్డి పుల్లారెడ్డి, రేసు ఎల్లయ్య, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి, ఉప్పు శెట్టి రాహుల్, వరక అజిత్, బచ్చలి రామయ్య, సాహెబ్, తదితరులు పాల్గొన్నారు

## కోయగూడెం ఓసి-III, జెవీఆర్ ఓసి-III బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించాలి

- ఇల్లందు ఏరియాను కాపాడాలని విజ్ఞప్తి





**ఇల్లందు, ఆగస్ట్ 9 (ప్రజా జ్యోతి)**కోయగూడెం ఓసి-III, జెవీఆర్ ఓసి-III బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించాలని కోరుతూ సింగరేణి కోల్ మెన్స్ కార్మిక సంఘ్ (ఏబికెయంఎస్- బియంఎస్) ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ లోని దిల్ కుషా గెస్ట్ హౌజ్ లో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. మణుగూరు పికె ఓసి-II డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ ప్రాజెక్టు బొగ్గు గని సింగరేణికి దక్కేలా చొరవ చూపిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి సింగరేణి కార్మికుల తరపున అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఏబికెయంఎస్ కార్యదర్శి, నేషనల్ డస్ట్ ప్రివెన్షన్ కమిటీ సభ్యుడు పి మాధవ్ నాయక్, ఏబికెయంఎస్ వర్కింగ్ కమిటీ మెంబర్ పులి రాజారెడ్డి, ఎస్సీయంకెఎస్ అధ్యక్షులు అప్పానీ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి కుమార్ స్వామి లు మాట్లాడుతూ దీర్ఘకాలంగా అభివృద్ధికి నోచుకోకుండా నిలిచిపోయిన కోయగూడెం ఓసి-III, జెవీఆర్ ఓసి-III బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణి యాజమాన్యాన్ని ఈ బొగ్గు బ్లాకుల వేలం ప్రక్రియలో పాల్గొనకుండా అడ్డుకోని ప్రైవేట్ సంస్థలకు కేటాయించే విధంగా నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించారు. సింగరేణికి కొత్త గనులు అందుబాటులోకి రాకపోవడంతో ఇప్పటికే ఉన్న గనుల బొగ్గు నిల్వలు తగ్గిపోతున్నాయని, కొన్ని గనులు మూసివేత దశకు చేరుకోవడంతో ఈ ఏడాది సుమారు 12 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి తగ్గే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కోయగూడెం ఓసి-III, జెవీఆర్ ఓసి-III బ్లాకుల్లో ఇప్పటివరకు బొగ్గు ఉత్పత్తి ప్రారంభం కాకపోవడానికి భూసేకరణ సమస్యలు, చట్టపరమైన వివాదాలు, గిరిజన ఏజెన్సీ ప్రాంతాలకు సంబంధించిన నియంత్రణలు, స్థానిక సమస్యలు, వివిధ అనుమతుల్లో జాప్యం వంటి కారణాలు ఉన్నాయని పేర్కొన్నారు.ఇల్లందు ప్రాంత భవిష్యత్తుకు కోయగూడెం ఓసి-III కీలకమని, సింగరేణి బొగ్గు ఉత్పత్తికి పుట్టినిల్లు అయిన ఇల్లందు ప్రాంతం నేడు కొత్త గనులు లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటుందని తెలిపారు. గనులు తగ్గిపోవడంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులను ఇతర ఏరియాలకు బదిలీ చేస్తున్నారని, ఫలితంగా స్థానిక ప్రజల ఉపాధి అవకాశాలు, ఆ ప్రాంత ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోయగూడెం ఓసి-III, జెవీఆర్ ఓసి-III బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయిస్తే ఈ ప్రాంతానికి సమీపంలోని బొగ్గు వనరులను వినియోగించుకోవడంతో పాటు కార్మికులకు ఉద్యోగ భద్రత, స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ బ్లాకులు సింగరేణికి లభిస్తే ఇప్పటికే ఉన్న మౌలిక సదుపాయాలు, భారీ యంత్రాలు, రవాణా వ్యవస్థలు, స్థానిక భౌగోళిక పరిజ్ఞానం సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని తెలిపారు. సమీపంలోని ఖాళీ గని ప్రాంతాలను ఓవర్‌బర్డెన్ డంపింగ్‌కు వినియోగించడం ద్వారా భూసేకరణ, వ్యయాన్ని తగ్గించే అవకాశం ఉంటుందన్నారు. బొగ్గు ఉత్పత్తి పెరిగి దక్షిణ భారత విద్యుత్ కేంద్రాలకు నిరంతర బొగ్గు సరఫరా బలోపేతం అవుతుందని, సింగరేణి ఉద్యోగుల భద్రతతో పాటు రాష్ట్ర, దేశ ఆర్థిక ప్రయోజనాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఇటీవల మణుగూరు పీకే-II డిప్ సైడ్ పొడిగింపు ప్రాజెక్టు సింగరేణికి దక్కేలా కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి చూపిన చొరవను మరువలేనిదని, అదే తరహాలో కోయగూడెం ఓసి-III, జెవీఆర్ ఓసి-III బొగ్గు బ్లాకుల విషయంలోనూ సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రస్తుత కేటాయింపులపై సమగ్ర సమీక్ష జరిపి, చట్టపరంగా సాధ్యమైన విధానాల ప్రకారం అవసరమైతే డీ-అలోకేషన్ చేసి, పునఃకేటాయింపు లేదా పునఃవేలం ద్వారా సింగరేణికి అవకాశం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తికి పుట్టినిల్లు అయిన ఇల్లందు ప్రాంతాన్ని కాపాడాలని, సంవత్సరాల తరబడి ఉపయోగంలోకి రాని బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయిస్తే బొగ్గు ఉత్పత్తితో పాటు కార్మికుల ఉద్యోగ భద్రత, స్థానిక ప్రజల ఉపాధి, సింగరేణి భవిష్యత్తు బలోపేతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏబికెయంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ జీవీ కృష్ణారెడ్డి, కోశాధికారి సాయి వేణి సతీష్, ఇల్లందు ఏరియా కార్యదర్శి లీలా కృష్ణ, భూపాల్ పల్లి ఏరియా ఉపాధ్యక్షులు సుజేందర్, భూపాల్ పల్లి కార్యదర్శి నరసింహ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ కళాకారులకు కాంగ్రెస్ హయాంలోనే సరైన న్యాయం

- రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల
- ఉద్యమ కళాకారుడు కాంపెల్లి వంశీ పాద యాత్రకు పాల్వంచలో ఘన స్వాగతం



**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 9,(ప్రజాజ్యోతి)** ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర సాధనలో శ్రమించిన ఉద్యమ కళాకారులకు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే సరైన న్యాయం జరుగుతుందని రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నిరుద్యోగ ఉద్యమ కళాకారులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా, న్యాయం జరిగేలా ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లాలనే ఉద్దేశంతో, కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా తెలంగాణ ఉద్యమ కారుడు, కేవీ కళాబృందం అధ్యక్షుడు కాంపెల్లి వంశీ చేపట్టిన పాదయాత్ర పాల్వంచకు చేరుకుంది. ఆగస్టు 5న ఖమ్మం జిల్లా తల్లాడ మండలం రెడ్డిగూడెం రామాలయం నుంచి భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి ఆలయం వరకు చేపట్టిన ఈ పాదయాత్రకు పాల్వంచ అంబేద్కర్ సెంటర్లో రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికి సంఘీభావం తెలిపారు. కాంపెల్లి వంశీ అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేపీ జగన్నాధపురం పెద్దమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ కళాకారులకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలోనే న్యాయం జరుగుతుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. పాద యాత్ర ద్వారా ప్రభుత్వం దృష్టికి వచ్చిన సమస్యలను తమ వంతుగా ప్రభుత్వానికి తీసుకెళ్లి, ఉద్యమ కళాకారులకు తగిన గుర్తింపు, అవకాశాలు కల్పించేలా కృషి చేస్తామని కొత్వాల తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితకుమారి, కార్పొరేటర్లు పైడిపల్లి జయలక్ష్మి, కొత్వాల విమలా దేవి, బాలు నాయక్, దంతెబోయిన నరేష్, వేగినాటి భవిత, సీరపు సుగుణ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జాలె జానకి రెడ్డి, మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షులు జలీల్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నూకల రంగారావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కొండం వెంకన్న గౌడ్, పులి సత్యనారాయణ, కందుకూరి రాము, బత్తుల వెంకటేశ్వరరావు, చింతా నాగరాజు, గుర్రం వెంకట రత్నం, దస్తగిరి, పట్టా వీరకుమార్, ఉండేటి శాంతివర్ధన్, దున్నపోతుల రవి, చింతలచెరువు రమేష్, సాధం రామకృష్ణ తదితరులు పాల్గొనగాసూర్యాపేట సాంస్కృతిక సేన జిల్లా అధ్యక్షులు ఎర్ర అనుదీప్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు పగిడిపాల వెంకటరావు, జిల్లా ఉపాధ్యక్షులు అడ్లూరి లక్ష్మణాచారి, మహిళా అధ్యక్షురాలు కోరం భాగ్యలక్ష్మి, ఉద్యమ కళాకారుడు గద్దర్ భాష, ఇందిరమ్మ వేషధారణతో పాదయాత్ర చేస్తున్న మొగిలి రాజ రమేష్, జానపద యుద్ధ నౌక పమ్మి రవి, జానపదం జోజి, దప్పు తిరుపతిరావు, తుంగతుర్తి నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి పోతురాజు సురేష్ తదితర ఉద్యమ కళాకారులు పాల్గొని పాదయాత్రకు సంఘీభావం తెలిపారు.

# గ్రామ గ్రామాన ఆదివాసీ జెండా రెపరెపలు

- ఘనంగా 32వ ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



**ఆళ్ళపల్లి, ఆగస్టు9(ప్రజా జ్యోతి)** ఆళ్ళపల్లి మండలంలో 32వ ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని మర్కోడు, తునికిబండల, మోకాళ్ల, అనంతోగు, రాయిపాడు, సుద్దరేవు తదితర గ్రామాల్లో సర్పంచ్లు సుతారి రమాదేవి, చంద్రశేఖర్, కల్తీ వెంకటేశ్వర్లు, ఊకే చిన్నపాపయ్య, కొమరం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆదివాసీ జెండాలను ఆవిష్కరించి వేడుకలు నిర్వహించారు. మండల కేంద్రంలో ఏఈడబ్ల్యూసీఏ జిల్లా ఉపాధ్యక్షులు జోగ రాంబాబు జెండా ఆవిష్కరించారు. అనంతరం ఐక్య కార్యాచరణ సమితి మండల అధ్యక్షులు పాయం రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పాయం నరసింహారావు, మాజీ ఎంపీపీ పెండకట్ల పాపారావు మాట్లాడారు. ఆదివాసీల హక్కులపై దాడులను అరికట్టి ఐదో షెడ్యూల్ను పటిష్టంగా అమలు చేయాలని, జల్–జంగల్–జమీన్పై ఆదివాసీల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ భూముల అన్యాక్రాంతాన్ని అరికట్టి, అర్హులైన వారికి హక్కుపత్రాలు ఇవ్వడంతో పాటు పోడు వ్యవసాయ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఆదివాసీ ప్రాంతాల్లో విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, ఉపాధి వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ రాష్ట్ర జేఏసీ నాయకులు తుమ్మ నాగరాజు, గౌరబోయిన సుబ్బారావు, గొగ్గల వినోద్, కొమరం వెంకటేశ్వర్లు, కొమరం సత్తెన్న, మాజీ ఎంపీపీ పడిగ సామ్మయ్య, గోగా దేరాజు, కొమరం వెంకటకృష్ణ, సుతారి కృష్ణ, జారా భాస్కర్, ఈసం సాంబశివరావుతో పాటు వివిధ గ్రామాల దొర పటేళ్లు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# ఎరువుల ధరలు తగ్గించి రైతులకు సరిపడా ఎరువులు అందించాలి

- ప్రజా చైతన్య యాత్రకు అపూర్వ స్పందన.. వందలాది బైకులతో భారీ ర్యాలీ

**ఆళ్ళపల్లి, ఆగస్టు9(ప్రజా జ్యోతి)** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్రకు ఆళ్లపల్లి మండలంలో అపూర్వ స్పందన లభించింది. యాత్ర నాలుగో రోజు ఆదివారం రాయిపాడు నుంచి ఆళ్లపల్లి మండల కేంద్రం వరకు వందలాది బైకులతో భారీ ర్యాలీ నిర్వహించారు. రాయిపాడు వద్ద మహిళలు జిల్లా నాయకులకు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. పెద్ద వెంకటాపురం సర్పంచ్ వజ్జ ఉమా, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషాకు పూలమాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎరువుల ధరలను తగ్గించి రైతులకు సరిపడా ఎరువులు సకాలంలో అందించాలని, పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి పింఛన్లు, కళ్యాణలక్ష్మిలో తులం బంగారం, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి పథకాలను అమలు చేయాలని కోరారు. మండలంలోని సాగులో ఉన్న గిరిజన, గిరిజనేతర పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, పెద్ద వెంకటాపురానికి త్రీఫేజ్ విద్యుత్, ఫారెస్ట్ అనుమతులు మంజూరు చేయాలని, ఆళ్ళపల్లి –అనిశెట్టిపల్లి డబుల్ రహదారికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మామకన్ను–ఆళ్లపల్లి, బట్టుపల్లి మార్గాల్లో అటవీ అనుమతులు మంజూరు చేసి రహదారులు, వంతెనల పనులు పూర్తి చేయాలని కోరారు. కొమరం భీమ్ పోరాట స్ఫూర్తితో జల్–జంగల్–జమీన్పై గిరిజనులకు హక్కులు కల్పించాలని అన్నారు. అనంతరం కొమరం భీమ్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముత్యాల విశ్వనాథం, నరాటి ప్రసాద్, సరెడ్డి పుల్లారెడ్డి, రేసు ఎల్లయ్య, ఉప్పుశెట్టి రాహుల్, చంద్రగిరి శ్రీనివాస్, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, వర్క అజిత్, భూక్య శ్రీనివాస్, నిమ్మల రాంబాబు, ధనలక్ష్మి, కొమరం హనుమంతరావు, గొగ్గెల కృష్ణ, వజ్జ ఉమా, నరేడ్ల రాంబాబు, వజ్జ పగడయ్య, షేక్ రహీం తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు

- హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి: ఊకె రవి
- గ్రామసభలతోనే ఆదివాసీ హక్కుల పరిరక్షణ: సొయం కన్నారాజు
- 1/70 చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు అడ్డుకోవాలి: డాక్టర్ గరికె శ్రీనివాస్



**ములకలపల్లి, ఆగస్టు 9 (ప్రజాజ్యోతి):** ఆదివాసీల హక్కులు, భూములు, అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు ఐక్యంగా పోరాడాలని ఆదివాసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టం, ఐదో షెడ్యూల్ను పకడ్బందీగా అమలు చేయించుకోవడంలో గ్రామసభలు, ఆదివాసీ సర్పంచులు కీలక పాత్ర పోషించాలని కోరారు. మండల కేంద్రంలో ఆదివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో జెండా ఆవిష్కరణలు నిర్వహించిన అనంతరం జగన్నాధపురం నుంచి భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. సుమారు వందలాది మంది ఆదివాసీల, సంప్రదాయ నృత్యాలు, డప్పుల మోత, కళారూపాలతో మండల కేంద్రం మార్మోగింది. ఆకుపచ్చ దుస్తుల్లో తరలివచ్చిన ఆదివాసీలతో మండల కేంద్రం సందడిగా మారింది. మహిళలు, యువత సంప్రదాయ వేషధారణలో చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ అధికార ప్రతినిధి సోయం కన్నరాజు, తెలంగాణ ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్, న్యాయవాది ఊకె రవి, గరికే శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ములకలపల్లి ఏజెన్సీలో ఆదివాసీల జనాభా క్రమంగా తగ్గుతుండగా, గిరిజనేతరుల వలసలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివాసీలకు తెలియకుండా, వారి సంతకాలు లేకుండా గ్రామసభల్లో తీర్మానాలు చేయడం, సర్పంచులపై ఒత్తిడి తెచ్చి భూములు, రహదారులకు అనుమతులు పొందే ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరారు. 1/70 చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను ఎదుర్కోవాలని, ఏజెన్సీ చట్టాల పరిరక్షణకు న్యాయపోరాటాన్ని కొనసాగించాలని తెలిపారు. కొమరం భీమ్ స్ఫూర్తితో ఆదివాసీలు హక్కుల సాధనకు నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆదివాసీ హక్కుల కోసం పోరాడుతున్న పలువురు ఉద్యమకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కొరస చంద్రకళ, మడకం రవి, సొడే కళ్యాణ్, కొర్స ఆదిలక్ష్మి, తానం పద్మ, కారం చంద్రకళ, కుంజా వినోద్, వాడే రాములు, ఆదివాసీ సీనియర్ నాయకులు కొండ్రు సుందర్రావు, కారం సుధీర్, మడకం చిరుమప్ప, పాయం నరసింహారావు, మడివి రాంబాబు, మడకం శ్రీను, కీసరి శ్రీనివాస్, సోడే శ్రీను, తాటి రవి, తాటి ప్రవీణ్, వాడే నరసింహారావు, బైట రాజేష్, బైటి రాము, గడ్డం ఉదయ్, ఊరబెద్ది వెంకన్న, వాడే నాగరాజు, కుంజా రాంబాబు, సున్నం సుధాకర్, ముత్యాలరావు, రాజారావు, ఎడమ రమేష్, మడకం సురేష్, ఇరపా రవి, కోడిమె వంశీ, వెల్కమ్ వెంకటేష్, మట్ల నాగమణి, దుబ్బ భాస్కర్, మీడియం నారాయణ, తాటి రాజారావు, కుంజా రాంబాబు, కుంజా వెంకటేశ్వర్లు, సున్నం రాజు, తదితరులు పాల్గొన్నారు.







## కోయగూడెం ఓసీ-3 బ్లాక్ సింగరేణికే దక్కాలి

- అరబిందో ఫార్మా నుంచి విముక్తి లభించడం హర్షణీయం: సీఐటీయూ



**కొత్తగూడెం:** కోయగూడెం ఓసీ–3 బ్లాక్‌ను తిరిగి సింగరేణి సంస్థకు దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మంద నరసింహారావు కోరారు. నాలుగేళ్ల క్రితం టెండర్ ద్వారా అరబిందో ఫార్మా కంపెనీ కోయగూడెం ఓసీ–3 బ్లాక్‌ను దక్కించుకున్నప్పటికీ, అనేక ఆటంకాల కారణంగా ఇప్పటివరకు బొగ్గు ఉత్పత్తి ప్రారంభించలేదన్నారు. ఈ బ్లాక్ 1/70 చట్ట పరిధిలో ఉండటంతో పాటు కేసు కూడా పెండింగ్‌లో ఉందని, దీంతో బ్లాక్ రద్దు చేయాలని సీఐటీయూ గతంలోనే డిమాండ్ చేస్తూ వచ్చిందన్నారు. ఎట్టకేలకు ప్రైవేటు సంస్థకు కేటాయించిన బ్లాక్ రద్దు కావడం పట్ల సీఐటీయూ హర్షం వ్యక్తం చేస్తోందన్నారు. భవిష్యత్తులో తిరిగి టెండర్లు నిర్వహిస్తే మణుగూరు డీప్‌సైడ్ బ్లాక్ తరహాలో కోయగూడెం ఓసీ–3 బ్లాక్‌ను కూడా సింగరేణి దక్కించుకునేలా అన్ని కార్మిక సంఘాలు, సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం సమష్టిగా ప్రయత్నించాలని కోరారు. బ్లాక్‌ను సింగరేణికి దక్కించుకునేందుకు జరిగే పోరాటాల్లో కార్మికులు భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇదే విధంగా సత్తుపల్లి ఓసీ–3 బ్లాక్‌ను కూడా సింగరేణికి దక్కేలా చర్యలు తీసుకోవాలని మంద నరసింహారావు కోరారు. అవంతిక కంపెనీకి కేటాయించిన ఈ బ్లాక్‌లో నాలుగేళ్లు గడిచినా అనేక కారణాలతో బొగ్గు ఉత్పత్తి ప్రారంభం కాలేదన్నారు. ముఖ్యంగా ఓవర్‌బర్డెన్ తరలింపునకు ప్రైవేటు సంస్థకు అవసరమైన స్థలం లేకపోవడంతో సింగరేణి స్థలం కోరినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. సింగరేణి భూమిని ప్రైవేటు సంస్థకు ఇవ్వకుండా బ్లాక్‌ను రద్దు చేసి తిరిగి సింగరేణికి వచ్చేలా ప్రభుత్వం, యాజమాన్యం, కార్మిక సంఘాలు కలిసి ప్రయత్నించాలని కోరారు. సింగరేణి భవిష్యత్తును కాపాడేందుకు బొగ్గు బ్లాకులను సంస్థ పరిధిలోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

## గజ్జ కట్టి... బోనం ఎత్తి... చిందులేసి!



# ఉద్యోగులపై ఒత్తిళ్లకు స్వస్తి పలకాలి!

- నెల్లిపాక పీఏసీఎస్‌లో వివాదం.. సీఈఓ రామారావుకు మద్దతుగా ఆదివాసీ సంఘాలు.. అధ్యక్షుడి తీరుపై తీవ్ర ఆరోపణలు




**అశ్వాపురం ఆగస్టు9, ప్రజాజ్యోతి**

నెల్లిపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో రైతుల ప్రయోజనాలు, సిబ్బంది సంక్షేమం, పరిపాలనా పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉండగా.. నెల్లిపాక పీఏసీఎస్‌లో మాత్రం సీఈఓ, సిబ్బందిపై ఒత్తిళ్లు, పరిపాలనా జోక్యం, ఆరోపణలు, ఫిర్యాదుల వ్యవహారం వివాదానికి దారితీస్తున్నట్లు తెలుస్తోంది. పీఏసీఎస్ సీఈఓ కుంజ రామారావుపై వచ్చిన అవినీతి ఆరోపణలను ఆదివాసీ సంఘాలు తీవ్రంగా ఖండిస్తూ ఆయనకు మద్దతుగా నిలిచాయి. తనపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సీఈఓ రామారావు నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డిపై పలు తీవ్రమైన ఆరోపణలు చేశారు.

తాను అమాయక గిరిజనుడినని, తనను సీఈఓ పదవిలోకి తీసుకొచ్చిన అనంతరం తన ఉద్యోగ జీవితం, కుటుంబ పరిస్థితులు తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టబడ్డాయని రామారావు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. తనపై లేనిపోని ఆరోపణలు చేస్తూ మానసికంగా వేధింపులకు గురిచేశారని ఆయన ఆరోపించారు. సంఘానికి సంబంధించిన నగదు నిల్వలు, ఖర్చులు, వ్యక్తిగత మరియు న్యాయపరమైన ఖర్చుల విషయంలో తాను ప్రశ్నించిన సందర్భాల్లో ఒత్తిళ్లు ఎదుర్కొన్నానని పేర్కొన్నారు.

**అవినీతి ఆరోపణల వెనుక అసలు కథ ఏమిటి?**

సీఈఓ రామారావుపై అవినీతి ఆరోపణలు రావడంతో పీఏసీఎస్‌లో నెలకొన్న పరిస్థితులపై చర్చ మొదలైంది. అయితే తనపై వచ్చిన ఆరోపణలను రామారావు ఖండిస్తూ, తాను ఉన్నతాధికారుల ఆదేశాలు, సంఘ నిబంధనల పరిధిలోనే పనిచేయడానికి ప్రయత్నించానని చెప్పినట్లు సమాచారం. తనను బాధ్యుడిగా చూపిస్తూ జరుగుతున్న పరిణామాల వెనుక అధ్యక్షుడి జోక్యం ఉందని ఆయన ఆరోపించారు.

సంఘానికి సంబంధించిన ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకత, రికార్డుల నిర్వహణ, నగదు లావాదేవీలు, అధికారిక అనుమతులు వంటి అంశాలపై పూర్తి స్థాయి విచారణ జరిగితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. ఆరోపణలు ఎవరి మీద వచ్చినా వాటిని రాజకీయ కోణంలో కాకుండా రికార్డుల ఆధారంగా విచారించాలని కోరారు.

**ఉద్యోగులపై ఒత్తిడి చేస్తున్నారంటూ ఆరోపణలు**

పీఏసీఎస్ అధ్యక్షుడు పదవిలోకి వచ్చినప్పటి నుంచి సీఈఓతో పాటు సిబ్బందిపై అనవసరమైన ఒత్తిడి కొనసాగుతోందని రామారావు ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా కొన్ని పనులు చేయాలని సిబ్బందిపై ఒత్తిడి తీసుకొచ్చేవారని, వాటిని ప్రశ్నించిన ఉద్యోగులపై ఫిర్యాదులు చేయడం, ఉన్నతాధికారులకు నివేదికలు పంపడం వంటి చర్యలు జరిగాయని ఆయన పేర్కొన్నారు.

తనకు నచ్చిన విధంగా పనిచేయని ఉద్యోగులపై చర్యలు తీసుకునే ప్రయత్నాలు గతంలో కూడా జరిగాయని ఆయన ఆరోపించారు. పలువురు ఉద్యోగులు సస్పెన్షన్‌కు గురికావడం, ఉద్యోగపరమైన ఇబ్బందులు ఎదుర్కోవడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**ఉద్యోగుల జీవితాలతో రాజకీయాలు వద్దు**

ఒక ఉద్యోగి తప్పు చేస్తే నిబంధనల ప్రకారం విచారణ జరిపి చర్యలు తీసుకోవడం సాధారణ పరిపాలనా ప్రక్రియ. అయితే వ్యక్తిగత విభేదాలు, రాజకీయ ఒత్తిళ్లు లేదా ఇతర కారణాలతో ఉద్యోగులపై చర్యలు తీసుకుంటే వారి కుటుంబాలపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని ఆదివాసీ సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు.

చిన్న స్థాయి ఉద్యోగులు తమ కుటుంబాలను పోషించేందుకు ఉద్యోగాలపై ఆధారపడుతున్నారని, వారిని పదేపదే ఫిర్యాదులు, సస్పెన్షన్లు, బదిలీలు, ఆరోపణల పేరుతో మానసిక ఒత్తిడికి గురిచేయడం సరికాదని వారు అన్నారు. ఉద్యోగులపై ఏవైనా ఆరోపణలు ఉంటే నిష్పక్షపాత విచారణ జరిపి, తప్పు నిర్ధారణ అయిన తర్వాత మాత్రమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**గత సిబ్బందిపైనా ఇలాంటి పరిస్థితులేనా?**

తన అధ్యక్ష పదవీకాలంలో పలువురు ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని రామారావు ఆరోపించారు. తన మాట వినని ఉద్యోగులపై తప్పుడు నివేదికలు, ఫిర్యాదులు పంపించి వారిని ఉన్నతాధికారుల దృష్టిలో తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరిగాయని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై కూడా జిల్లా స్థాయి అధికారులు గతంలో జరిగిన సిబ్బంది వ్యవహారాలు, సస్పెన్షన్లు, ఫిర్యాదులు, విచారణ నివేదికలను పరిశీలిస్తే అసలు పరిస్థితి ఏమిటో తేలుతుందని ఆయన అన్నారు.

గతంలో పనిచేసిన ఓ మాజీ సీఈఓ విషయంలో కూడా వివాదాస్పద పరిణామాలు చోటుచేసుకున్నాయని రామారావు ఆరోపించారు. అయితే ఆ అంశానికి సంబంధించి వాస్తవాలను అధికారిక రికార్డుల ఆధారంగా నిర్ధారించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

**రైతు సేవలపై ప్రభావం పడకూడదు**

పీఏసీఎస్‌లు ప్రధానంగా రైతులకు ఎరువులు, విత్తనాలు, రుణాలు, ధాన్యం కొనుగోలు తదితర సేవలను అందించాల్సిన సంస్థలు. అక్కడి పరిపాలనా వివాదాలు, సిబ్బంది మధ్య విభేదాలు, రాజకీయ జోక్యం వంటి అంశాలు రైతుల సేవలకు ఆటంకం కలిగిస్తే చివరకు నష్టపోయేది రైతులేనని స్థానికులు అంటున్నారు.

ఆఫీస్ సమయాల్లో సిబ్బందిపై ఒత్తిళ్లు, దురుసు ప్రవర్తన, నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయాలనే ఒత్తిడి ఉంటే కార్యాలయ పనితీరు దెబ్బతింటుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయానికి వచ్చినప్పుడు సిబ్బంది స్వేచ్ఛగా పనిచేసే వాతావరణం ఉండాలని కోరుతున్నారు.

**జిల్లా అధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలి**

నెల్లిపాక పీఏసీఎస్‌లో నెలకొన్న వివాదానికి శాశ్వత పరిష్కారం చూపేందుకు జిల్లా స్థాయి అధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆదివాసీ సంఘాలు డిమాండ్ చేశాయి. సీఈఓపై వచ్చిన అవినీతి ఆరోపణలతో పాటు అధ్యక్షుడిపై సీఈఓ చేసిన ఆరోపణలను కూడా సమానంగా పరిగణించి స్వతంత్రంగా విచారణ జరపాలని కోరాయి.

సంఘంలోని నగదు లావాదేవీలు, ఖర్చులు, రికార్డులు, అధికారిక అనుమతులు, ఉద్యోగులపై గతంలో తీసుకున్న చర్యలు, ఉన్నతాధికారులకు పంపిన నివేదికలు తదితర అంశాలపై సమగ్ర ఆడిట్‌తో పాటు విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వారు అన్నారు.

తనకు లేదా తన కుటుంబానికి ఏదైనా అనుకోని సంఘటన జరిగితే అందుకు అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డే బాధ్యత వహించాల్సి ఉంటుందని సీఈఓ రామారావు మీడియా సమావేశంలో పేర్కొన్నట్లు తెలిపారు. అయితే ఇటువంటి తీవ్రమైన ఆరోపణల నేపథ్యంలో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, సీఈఓకు తగిన రక్షణ కల్పించడంతో పాటు మొత్తం వ్యవహారంపై నిష్పక్షపాత విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని ఆదివాసీ సంఘాలు కోరుతున్నాయి.

ఇదిలా ఉండగా, సీఈఓ రామారావు చేసిన ఆరోపణలపై అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి వైపు నుంచి అధికారిక వివరణ అందాల్సి ఉంది. ఇరువర్గాల వాదనలు, అధికారిక రికార్డులు, విచారణ నివేదికలు వెలుగులోకి వచ్చినప్పుడే ఆరోపణల్లో వాస్తవం ఎంతమేర ఉందో స్పష్టమవుతుంది. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పీఏసీఎస్‌లో పరిపాలన సజావుగా సాగేందుకు ఉన్నతాధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

